## పాండిచ్చేరి సెంట్రల్ వర్సిటీ వీసీగా ప్రకాశ్‌బాబు

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియామకమయ్యారు. రాష్ట్రపతి ఆమోదం మేరకు కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశ్‌బాబు హెచ్‌సీయూలో బయోటెక్నాలజీ, బయోఇన్ఫార్మాటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయన ఐదేండ్లు పాండిచ్చేరి వీసీగా కొనసాగుతారు. అలాగే ది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ వీసీగా నాగరాజును నియమించారు.

## దూరదర్శన్ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ మృతి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): దూరదర్శన్ కేంద్రం మాజీ డైరెక్టర్ దేవళ్ల బాలకృష్ణ (92) గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో మరణించినట్టు వారి బంధువులు వెల్లడించారు. బాలకృష్ణ హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ కంటే ముందు పలు ఆకాశవాణి కేంద్రాలలో వివిధ హోదాల్లో పనిచేశారు. అలాగే హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా సేవలు అందించారు. ఆయన మృతి పట్ల ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రం సిబ్బంది ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

## ఆటోడ్రైవర్ ఆత్మహత్య

**ఆటో నడువక..**
**అప్పులు తీర్చలేక బలవన్మరణం**
**ఆదిలాబాద్ జిల్లాలో విషాదం**


సంతోష్ (ఫైల్)

బజార్‌హత్నూర్, మార్చి 6 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం రాంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ భగత్ సంతోష్(36) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం సంతోష్ కుటుంబ పోషణ కోసం రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆటో సరిగా నడవకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. గురువారం ఇంటి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంతోష్ భార్య రోజా ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నారు.

# ఇసుకే బంగారమాయె!

- నెలరోజులైనా దిగిరాని ధరలు
- బెడిసికొడుతున్న నూతన విధానం
- రూ.2000దాటిన టన్ను ఇసుక
- నిర్మాణాలపై తీవ్ర ప్రభావం



హైదరాబాద్, మార్చి 6(నమస్తే తెలంగాణ): ఇసుక బంగారమైపోయింది. నూతన విధానం పేరుతో ప్రభుత్వ చర్యలు బెడిసికొడుతున్నాయి. రూ.1200 నుంచి 1400 మధ్య ఉండాల్సిన ఇసుక టన్ను ధర నెలరోజులుగా రూ.2000కుపైగా పలుకుతున్నది. రీచ్‌ల వద్ద లోడింగ్ కోసం రెండు రోజులు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డర్ ఇచ్చిన వెంటనే ఇసుకను ఇంటికి సరఫరా చేస్తామని అధికారులు చెప్తున్నారు. అయితే ఏదైనా చిరునామాపై మాత్రమే ఇసుక బుకింగ్ చేయాలని, అడ్డాలపై ఇసుకను విక్రయించే వీలులేదని అధికారులు నిబంధన విధించడంతో బహిరంగ మార్కెట్‌లో ఇసుక లభ్యంకాని పరిస్థితి ఏర్పడింది. ఇసుక లారీలు బుకింగ్ చేసుకునే పరిస్థితి లేకుండాపోయింది.

### తడిసి మోపెడవుతున్న ఖర్చులు

రాత్రి 9 గంటల వరకు ఇసుక లోడింగ్‌కు అనుమతిచ్చినప్పటికీ కాంట్రాక్టర్లు మాత్రం లోడింగ్ చేయడంలేదని రవాణాదారులు తెలిపారు. ఇసుక లోడింగ్‌కే రెండు రోజుల సమయం పడుతున్నదని, ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని చెప్పారు. ఓవర్ లోడింగ్‌ను అదుపుచేసినప్పటికీ డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుకను అందుబాటులో ఉంచితే ధరలు అదుపులో ఉంటాయని, అలాకాకుండా ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ధరలు అమాంతం పెంచేశారని విమర్శిస్తున్నారు. ఇసుక రీచ్‌ల నుంచి రోజుకు సగటున 60వేల మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా జరగాల్సివుండగా, ఇప్పుడు సగానికి పడిపోయిందని వెల్లడించారు. అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదని పేర్కొన్నారు. పర్యవేక్షణ బాధ్యతలు కలెక్టర్లకు అప్పగించడంతో ఇసుక రవాణాలో మరింత జాప్యం చోటుచేసుకుంటున్నదని వివరించారు.

### వినియోగదారుల ఇబ్బందులు పట్టవా?

అక్రమాలను అదుపుచేయడం మంచిదే అయినప్పటికీ వినియోగదారులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి టీజీఎండీసీ ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇసుక తవ్వకాలు, రవాణా ఖర్చులు తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు మార్కెట్‌లో ఇసుక సరఫరాను పెంచడం ద్వారా ధరలు తగ్గించే ఆస్కారముందని ఇండ్ల నిర్మాణదారులు అభిప్రాయపడ్డారు. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా ఉంటే ధరలు నిలకడగా ఉంటాయని, సరఫరా తగ్గినందునే ధరలు పెరిగాయని చెప్పారు. ఇసుక ధర నెలరోజుల నుంచి టన్నుకు రూ.2000పైగా పలుకుతున్నదని వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో దొడ్డు ఇసుక ధర రూ.2000, ఫైన్ శాండ్ రూ.2100కుపైగా పలుకుతున్నదని తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ ఇసుకను మార్కెట్‌లో అందుబాటులో ఉంచేందుకు టీజీఎండీసీ చర్యలు చేపట్టాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

## గోవర్ధన గిరిధారిగా లక్ష్మీనారసింహుడు



యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు గోవర్ధనగిరిధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుడిచేతిలో పిల్లనగ్రోవి, ఎడమచేతి చిటికెనవేలిపై గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన స్వామివారిని పట్టుపీతాంబరాలతో అలంకరించి తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం స్వామివారు సింహవాహనంపై ఊరేగారు. శుక్రవారం రాత్రి స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించనున్నారు.

# జీహెచ్‌ఎంసీలో నిలిచిన టీడీఆర్‌లు

మొదటిపేజీ తరువాయి...



ఈ టీడీఆర్‌ను ఇస్తున్నారు. నిర్వాసితుడు కోల్పోయిన దానికి నాలుగు రెట్లకు టీడీఆర్ పత్రాలను పరిహారంగా పొందుతాడు. ఉదాహరణకు అమీర్‌పేటలో 20 గజాల స్థలాన్ని కోల్పోయిన నిర్వాసితుడు జీహెచ్‌ఎంసీ ఇచ్చే 80 గజాల టీడీఆర్ పత్రాన్ని తీసుకుని ఇతరులకు విక్రయించుకునే హక్కు పొందుతాడు. యాజమాని తన దగ్గరున్న టీడీఆర్‌ను ఎన్ని భాగాలుగానైనా అమ్ముకునే వీలు ఉంటుంది. టీడీఆర్ కొనుగోలు చేసిన వారు దానితో నిర్మాణ అనుమతి రుసుం చెల్లించవచ్చు. అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ మినహాయింపులకూ టీడీఆర్ సర్టిఫికెట్ ఉపయోగపడుతుంది. దీంతో ఖరీదైన ప్రాంతాల్లో పరిమితికి మించి అదనపు అంతస్తులు నిర్మించాలనుకునే వారంతా టీడీఆర్‌ను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త టీడీఆర్‌లు రాకపోవడంతో మార్కెట్లో ఇప్పటికే ఉన్న టీడీఆర్‌లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

### భారీగా నిలిచిన దరఖాస్తులు

కొన్ని నెలలుగా జీహెచ్‌ఎంసీకి కొత్త ప్రాజెక్టులు లేవని, హెచ్-సిటీ ప్రాజెక్టుల పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభ దశకు వచ్చాయని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన టీడీఆర్‌లను త్వరలో ఇవ్వనున్నామని అధికారులు తెలిపారు. కానీ వాటర్‌బాడీ, రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన బాధితులకు సైతం టీడీఆర్ సకాలంలో అందడం లేదు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయి టౌన్‌ప్లానింగ్ అధికారి మొదలు కమిషనర్ వరకు వందల సంఖ్యలో టీడీఆర్ దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేక నిలిచిపోవడం గమనార్హం. కమిషనర్ మాత్రం వచ్చే నెలలో టీడీఆర్‌లపై నిర్ణయం తీసుకుందామని చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది.

### ఆదర్శ పథకానికి తూట్లు

ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు పూర్తి కావాలంటే భూసేకరణ అత్యంత కీలకం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆస్తుల సేకరణలో గణనీయమైన మార్పును తీసుకువచ్చింది. 2017లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 'టీడీఆర్' పాలసీని తీసుకొచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లో టీడీఆర్‌ను అమలు చేశారు. దేశంలో మరే ఏ నగరంలో జరుగని విధంగా రికార్డు స్థాయిలో ఈ టీడీఆర్‌లను జీహెచ్‌ఎంసీ అందజేసింది. అభివృద్ధి కార్యక్రమాల కోసం చేసే భూసేకరణకు నగదు మొత్తం ఇవ్వడానికి బదులుగా టీడీఆర్‌లు ఇచ్చే విధానాన్ని, టీడీఆర్ బ్యాంకును ప్రవేశపెట్టిన జీహెచ్‌ఎంసీని కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీతి అయోగ్ కూడా ప్రశంసించింది. ఈ టీడీఆర్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అవలంబించాలని నీతి అయోగ్ సూచించింది. ఇంత విజయవంతమైన టీడీఆర్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చింది.

## మహిళా పోలీసులకు పెట్రోకార్ విధులు

నిర్మల్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల ఓ కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ డ్యూటీలకే పరిమితమైన మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులను జనానికి చేరువ చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారంలో ఒక రోజు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో పురుష కానిస్టేబుల్‌తో కలిసి పెట్రోకార్ డ్యూటీ చేయాలని మహిళా కానిస్టేబుళ్లను ఆదేశించారు. ఇకపై ఎమర్జెన్సీ కాల్స్ కూడా మహిళా పోలీసులు అటెండ్ చేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచే అమలు చేసినట్టు ఎస్పీ తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఎక్స్ వేదికగా ఎస్పీ జానకీషర్మిలను అభినందిస్తూ ట్వీట్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.



పెట్రోకార్ విధులకు వెళ్తున్న మహిళా కానిస్టేబుళ్లు




మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో రోబోటిక్ సర్జరీ సేవలను ప్రారంభిస్తున్న కల్పనారెడ్డి, భద్రారెడ్డి, ప్రీతిరెడ్డి

## రోబోటిక్ సర్జరీ సేవలను వినియోగించుకోవాలి

- మల్లారెడ్డి వైద్యశాలల చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి
- 'మల్లారెడ్డి నారాయణ'లో రోబోటిక్ సేవల ప్రారంభోత్సవం

దుండిగల్, మార్చి 6 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ వైద్యశాలలో గురువారం నుంచి రోబోటిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎస్ఎస్ఐ మంత్ర 3.0 పేరిట ఏర్పాటుచేసిన సేవలను మల్లారెడ్డి విశ్వవిద్యాలయం చాన్సలర్ కల్పనారెడ్డి, మల్లారెడ్డి వైద్యశాలల చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి రోబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థను తమ వైద్యశాలలో ప్రవేశపెట్టడం గర్వంగా ఉందని తెలిపారు. రోబోటిక్ సర్జరీతో రోగి వేగంగా కోలుకునే అవకాశం ఉన్నట్టు చెప్పారు. ఇక్కడి ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. ప్రీతిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో రోబోటిక్స్ విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అత్యంత అధునాత రోబోటిక్ వ్యవస్థ ఎస్ఎస్ఐ మంత్ర 3.0 సేవలను మొదటిసారిగా మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## కోర్టు ఆదేశాలను ధిక్కరించిన కొండా సురేఖ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 6 (నమస్తే తెలంగాణ): సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వరుసగా రెండో సారి కోర్టుకు జమానత్‌లు సమర్పించలేదు. కోర్టు ఆదేశాలను మంత్రి పట్టించుకోవడం లేదని, కావాలని కాలయాపన చేస్తున్నారని నాగార్జున తరపు న్యాయవాది ఆరోపించారు. మంత్రి గైర్హాజరుపై ఆమె తరపు న్యాయవాది ఇచ్చిన పిటిషన్‌ను ప్రజా ప్రతినిధుల కోర్టు అంగీకరించి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది.

## దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 40 స్టేషన్లు అభివృద్ధి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 40 రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ముఖ్యంగా దాదాపు రూ.700 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. 25 కోట్లతో వరంగల్ రైల్వేస్టేషన్, రూ.27.61 కోట్లతో మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. అమృత్ భారత్ పథకం కింద ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.